సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 26.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 265
పేజీలు: 08 వెల: రూ. 5

## జన్-జీ పోరాటం ఆగొద్దు.. 03
# కేసులు ఎత్తివేయాలి
### చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గించాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడికి హైదరాబాద్ లో నిరసన
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ






## హైడ్రాపై ఆగ్రహం..
# ఆర్మీ సాయం!
### కోర్టు ఆదేశాలు లెక్క చేయరా?

- హైడ్రా చుట్టూ న్యాయ, రాజకీయ దుమారం
- అవసరమైతే ఆర్మీతోనైనా అరెస్టు చేయిస్తాం
- ఒకవైపు కోర్టు మందలింపు.. మరోవైపు ఆర్మీ ప్రశంస
- చట్టం దాటితే చర్యలు తప్పవన్న హైకోర్టు
- ఆక్రమణలపై ఉక్కుపాదం.. చట్టపరమైన ప్రశ్నలు
- హైడ్రా చుట్టూ న్యాయ, రాజకీయ దుమారం

02

## ప్రజాస్వామ్యం గెలిచింది
### జెన్‌జీ ఆందోళనల తొలి గెలుపు



- విద్యార్థుల సామూహిక సంకల్ప విజయమిది
- కేంద్రానికి మా సత్తా చూపాం
- ధర్మేంద్ర రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే

02

## చర్చలు
# సఫలం
### కాక్రోచ్ జనతాపార్టీ మూడు డిమాండ్లకు కేంద్రం అంగీకారం



- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం
- నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు కేంద్రం అంగీకారం
- ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన

04

## ధర్మేంద్ర ప్రధాన్
# 'రాజీ'నామా..
### మోడీ కేబినెట్ 'నో' అన్నా వినని విద్యాశాఖ మంత్రి..

- నీట్ సెగతో పదవీ త్యాగం
- నీట్ అక్రమాలకు నైతిక బాధ్యత..
- సీజేపీ డెడ్‌లైన్.. తెరవెనుక రాజకీయాలు!
- మోదీకి లేఖ రాస్తూ వైదొలిగిన విద్యాశాఖ మంత్రి
- తెరవెనుక ఏం జరిగిందంటే?



**ముద్ర డెస్క్:** నీట్ లీకేజీ వివాదం నేపథ్యంలో నెలల తరబడి సాగిన ఆందోళనలు చివరకు ఫలించాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి బాధ్యత తీసుకుంటూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ ఈ రాజీనామా వెనుక కేవలం ఒక మంత్రి నిర్ణయం మాత్రమే కాదు. రాజకీయ ఒత్తిడి, గడువులు, చర్చలు, అంతర్గత సంకేతాలు ఉన్నాయి.

**నెలల తరబడి ఒత్తిడి..**
కొన్ని నెలలుగా కాక్రోజ్ జనతాపార్టీ(సీజేపీ) నేతృత్వంలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నీట్ పేపర్ లీక్‌పై బాధ్యత వహించాలని మంత్రి రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరంతరం నిరసనలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇతర డిమాండ్లపై సుముఖంగా ఉన్నట్లు సూచనలు వచ్చినా, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం మొదటి నుంచి గట్టి వైఖరి అవలంబించింది.

**గడువు విధించిన సీజేపీ..**
కేంద్ర మంత్రులతో సీజేపీ ప్రతినిధులు జూలై 24న చర్చలు జరిపారు. రెండు అంశాలకు కేంద్రం సుముఖత తెలిపింది. ధర్మేంద్ర ప్రధాన్ మిగతా 02లో

## ఆగస్టు నుంచి సంజీవని
### రూ.197 కోట్లు మహిళలకు అందజేత 02

- ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ఐడీ
- వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తాం




## మోదీ కొత్త
# వ్యూహం
### హాయ్ ఫ్రెండ్స్‌తో యువతకు చేరువ
### సంక్షోభాన్ని అవకాశంగా మలిచిన వ్యూహం

- సెల్ఫీ వీడియోతో డిజిటల్ మాస్టర్ స్ట్రోక్
- నీట్ వివాదంలో సోషల్ మీడియా అస్త్రం
- యువత భాషలో మోదీ కొత్త సందేశం
- రాజకీయానికి కొత్త టచ్
- సోషల్ మీడియాలో మోదీ స్టయిల్ మారింది
- డిజిటల్ సమాధానం
- యువతను టార్గెట్ చేసి ప్లాన్




**ముద్ర డెస్క్:** సాధారణంగా భారత రాజకీయాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం అంటే "భాయియో ఔర్ బహెనో", "సవా కరోడ్ దేశ్‌వాసియో" లేదా "భారత్ మాతాకీ జై" అనే గంభీరమైన నినాదాలు టక్కున గుర్తొస్తాయి. కానీ కాలంతో పాటు మారడమే కాకుండా కాలాన్ని కూడా తన వైపు తిప్పుకోవడం మోదీ శైలి. తాజాగా ఆయన సోషల్ మీడియా వేదికగా తీసుకుంటున్న నిర్ణయాలు, విడుదల చేస్తున్న వీడియోలు ప్రధానిలోని ఒక సరికొత్త జనరేషన్ జెడ్ దృక్పథాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దేశంలో తలనెప్పిగా మారిన వివాదాలను పరిష్కరించే క్రమంలో యువతకు నేరుగా కనెక్ట్ అయ్యేందుకు మోదీ ఎంచుకున్న సరికొత్త వ్యూహం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**సంక్షోభంలో ప్రతిపక్షాల రాజకీయం.. పార్లమెంట్ వద్ద సెల్ఫీ వీడియో**
ఇటీవల 'నీట్' పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. జంతర్ మంతర్ వేదికగా 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆందోళనలతో పాటు.. విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రయత్నించాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సైతం ఆందోళనల్లో పాల్గొంటూ తన పగిలిన బూట్లు, చిరిగిన దుస్తులను చూపిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం ముమ్మరం చేశారు. ఇందిరా గాంధీ త్యాగాలతో పోలుస్తూ కాంగ్రెస్ వర్గాలు తీవ్ర రాజకీయ ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశాయి.
ఈ రాజకీయ వేడిని, యువతలో ఉన్న ఆగ్రహాన్ని గమనించిన ప్రధాని మోదీ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. యుద్ధ ప్రాతిపదికన పార్లమెంట్ భవనం నేపథ్యంగా ఒక అర్ధరాత్రి సెల్ఫీ వీడియోను వదిలి సంచలనం సృష్టించా రు. "పేపర్ లీకేజీకి పాల్పడిన దోషులెవరినీ విడిచిపెట్టేది లేదు.. కఠిన చర్యలు తథ్యం!" అని నేరుగా హామీ ఇచ్చి పరిస్థితిని ఒక్కసారిగా తన అదుపులోకి తెచ్చుకున్నారు.

**"మై ఫ్రెండ్స్.." మార్పుకు సంకేతం**
తొలి వీడియో ఇచ్చిన ఊపుతో తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ మరో సంచలన వీడి యోను పోస్ట్ చేశారు. ఈ రెండింట్లోనూ అం దరినీ ఆశ్చర్యపరిచింది ఆయన సంబోధన. పాత శైలికి గుడ్‌బై చెబుతూ "భాయియో బహెనో", "దేశ్‌వాసియో" అనే సంప్రదాయ పదాలను పక్కనబెట్టారు. జెన్ జెడ్ స్టైల్ ఫాలో అయ్యారు. జస్ట్ "హాయ్ మై ఫ్రెండ్స్.." అంటూ ఎంతో ఆత్మీయంగా, క్లోజ్ ఫ్రెండ్‌లా సంభాషణ ప్రారంభించారు. "థాంక్యూ ఫ్రెండ్స్.. నిన్న రాత్రి మీతో మిగతా 02లో

## మంత్రి అడ్లూరికి
# కీలక బాధ్యత
### ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లుపై కీలక కమిటీల్లో స్థానం

03

- సామాజిక న్యాయం – సమాన అవకాశాల దిశగా సీఎం రేవంత్ మరో ముందడుగు
- అణగారిన వర్గాల స్వరం ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిధ్వనించేలా బాధ్యతలు



## ఆంధ్రా కీలక రైల్వే
# ప్రాజెక్టులకు ఆమోదం
### కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు

- గుంతకల్లు–బళ్లారి 3, 4వ రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్
- రూ.1,264 కోట్ల రైల్వే ప్రాజెక్టుతో రాయలసీమకు భారీ ఊతం..
- తూర్పు–పడమర రైల్వే కారిడార్ బలోపేతం

03



# ఎక్కడ తగ్గాలో తెలుసు
### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై మోడీ నిర్ణయం చర్చనీయాంశం

- వెనక్కి తగ్గారా?.. వ్యూహాత్మక అడుగా?
- ప్రతిపక్షాలకు ఆయుధంగా మారిన నిర్ణయం
- మోడీ ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందా?
- రాజకీయ వర్గాల్లో వేడెక్కిన చర్చలు
- '56 ఇంచుల ఛాతీ'పై మళ్లీ మొదలైన విమర్శలు
- మంత్రి రాజీనామాతో మారిన సమీకరణాలు
- మద్దతుదారుల్లోనూ మొదలైన ప్రశ్నలు
- ఒత్తిడికి మోడీ లొంగడమా?
- ఒక నిర్ణయంతో దేశ రాజకీయాల్లో కొత్త చర్చ




**ముద్ర డెస్క్:** అవి అసాంఘిక శక్తులని తెలుసు. అవి చేస్తున్న ఉద్యమం సో కాల్డ్ అని కూడా తెలుసు. దానిని ఎలా వంచాలో కూడా తెలుసు. అయినప్పటికీ నరేంద్ర మోడీ బయపడ్డారు. తనకు 56 ఇంచుల భారీ చాతి ఉందని.. తాను దేనికి భయపడనని పదేపదే చెప్పుకునే మోడీ.. ఇప్పుడు ఏకంగా బొద్దింకలను చూసి భయపడి పోవడం.. ఏకంగా తన విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించడం.. ఒకరకంగా ప్రపంచంలోనే మిగతా 02లో

## ఇదీ AI ముద్ర

పటిష్టమైన ఇంగ్లండ్, ఐర్లాండ్ లపై ఓడి.. పసికూన జింబాబ్వేపై టీమిండియా అలవోక విజయంపై సెటైరికల్ పడుతున్నాయి.






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 26.07.2026
www.mudranews.in | @mudranews



### ముసలితనం రాకుండా తేనె – పెరుగు ఫేస్ ప్యాక్

ఒక చెంచా తేనె, ఒక చెంచా పెరుగు కలిపి ముఖానికి రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రం చేయండి. చర్మం మృదువుగా, కాంతివంతంగా కనిపించేందుకు ఇది ఉపయోగపడుతుంది.



### కేంద్రమంత్రి రిజైన్ చేస్తే సరిపోదు..

# భవిష్యత్ లో పేపర్ లీకేజీలు జరగకుండా సంస్కరణలు తేవాలి

**- కంటితుడుపు చర్యలు కాదు విద్యార్థులకు నిజమైన న్యాయం జరగాలి**
**- విద్యార్థులపై దమనకాండకు దిగిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి**
**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ముద్ర, హైదరదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ఎట్టకేలకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయటంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పందించారు. విద్యార్థుల ప్రొటెస్ట్ కారణంగానే కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేవలం కేంద్ర మంత్రి రిజైన్ చేస్తే సరిపోదని కవిత ఎక్స్ లో పోస్ట్ చేశారు. పేపర్ లీకేజీ సంక్షోభాలకు ఇది ఎంత మాత్రం పరిష్కారం కాదన్నారు. కేవలం బీజేపీకి జరిగిన డ్యామేజ్ కంట్రోల్ చేసుకునేందుకే కేంద్రమంత్రి తో రాజీనామా చేయించారని చెప్పారు. విద్యార్థులకు నిజంగా న్యాయం జరగాలంటే మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవస్థాగత సంస్కరణల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందన్నారు. UPSC తరహాలోనే NTAకు కూడా చట్టబద్ధమైన స్వతంత్రత ఇవ్వాలన్నారు. భవిష్యత్ లో పేపర్ లీకేజీలను అరికట్టేందుకు అత్యంత కఠినమైన చట్టాలను తీసుకురావాలని కవిత కోరారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. వీటన్నింటికి తోడు ఈనెల 20న విద్యార్థులపై పాశవికంగా పోలీసులు జరిపిన దమనకాండపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జ్ కు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. అప్పుడు మాత్రమే విద్యార్థులకు జరిగిన అన్యాయానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కేవలం కేంద్రమంత్రితో రాజీనామా చేయించి కంటితుడుపు చర్యలు చేపడతామంటే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు.



## ఉండవల్లి గుహల్లో తెలుగు మహోత్సవం



**ముద్ర, అమరావతి :** తెలుగు మహోత్సవం పేరుతో సృజనాత్మక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు తేజస్వి పొడపాటి ఆధ్వర్యంలో ఉండవల్లి గుహల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలుగు , సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ లక్ష్మి షా, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ శ్రీనివాస్, ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, డి.జి.పి ఐ.పి.ఎస్ సరిత, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విల్సన్ @ శరత్ చంద్ర మాట్లాడుతూ తెలుగు భాష అంతరించిపోతోంది అని దాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి అని కోరారు. ప్రపంచంలో 80 % దేశాల్లో వారి మాతృభాషలోనే విద్యా బోధన జరుగుతుంది అన్నారు. మన భాష మన సంస్కృతి మన అస్థిత్వం, ఆత్మ గౌరవ పతాక అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఒక కవిత రాసుకొచ్చి చదవడం విశేషం. ఉషా పత్రికను కలెక్టర్ లక్ష్మీ షా ఆవిష్కరణ చేశారు.

## సమరస్తా సంకల్ప అభియాన్ లో కొండేటి శ్రీధర్

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శనివారం "సంత్ శిరోమణి గురు రవి దాస్ మహారాజ్"గారి 650వ జయంత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమ ముఖ్య అతిధులుగా తెలంగాణ బీజేపీ పార్టీ రధసారధి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు గారు సంఘటన మంత్రి చంద్రశేఖర్ జి గారితో పాటు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం సంత్ రవి దాస్ మహారాజ్ గారి జయంతి సందర్భంగా బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సమరత్స సంకల్ప అభియాన్ స్టేట్ లెవల్ వర్క్ షాప్ లో వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు మాజీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్ గారు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ గారు, ఎస్సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ గారు,రాష్ట్ర మరియు ఎస్సి మోర్చా నాయకులు పాల్గొన్నారు...

# ట్రంప్‌కు బిగ్ షాక్..

**హెచ్-1బీ లక్ష డాలర్ల ఫీజుకు కోర్టు బ్రేక్..**
**-భారతీయ ఐటీ నిపుణులకు ఊరట**



**ముద్ర డెస్క్ :** హెచ్-1బీ వీసాలపై భారీగా 1 లక్ష డాలర్ల ఫీజు విధించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదనకు అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తాత్కాలిక బ్రేక్ వేసింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ప్రభుత్వం ఇలాంటి భారీ ఫీజులు విధించే అధికారం లేదని స్పష్టం చేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన స్టేను సమర్థించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న హెచ్-1బీ దరఖాస్తు ఫీజులే కొనసాగనున్నాయి. ట్రంప్ ప్రభుత్వం విదేశీ ఉద్యోగుల నియామకాన్ని తగ్గించి అమెరికన్లకు ఎక్కువ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన తీసుకొచ్చింది. ప్రస్తుతం హెచ్-1బీ వీసా దరఖాస్తుకు కంపెనీలు చెల్లించే ఫీజు సుమారు 2,000 నుంచి 5,000 డాలర్ల మధ్య ఉండగా, దానిని ఏకంగా 1 లక్ష డాలర్లకు పెంచాలని భావించింది.ఈ ప్రతిపాదన అమలైతే చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలపై తీవ్ర ఆర్థిక భారం పడటంతో పాటు భారతీయ ఐటీ నిపుణుల నియామకాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉండేది. తాజా కోర్టు తీర్పుతో ఆ ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. ముఖ్యంగా ప్రతి ఏడాది హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాకు వెళ్లే వేలాది మంది భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, అలాగే వారిని నియమించే టెక్ కంపెనీలకు ఈ నిర్ణయం ఊరటనిచ్చింది.

### అరుణాచల మోక్ష మార్గంలో చిక్కుకుని ఆంధ్రా భక్తుడి మృతి

ముద్ర, అమరావతి : తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలోని ఇడుక్కి పిళ్లైయార్ గుహ (మోక్షమార్గం)లో చిక్కుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ భక్తుడు మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మణికుమార్ (36) కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ దర్శనం అనంతరం గిరి ప్రదక్షిణ చేస్తుండగా గుహలో ప్రవేశించి ఇరుక్కుపోయాడు. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## కాలేయ వ్యాధుల అవగాహనకు 'లాస్ట్ వార్నింగ్', 'ఆఖరి హెచ్చరిక' పుస్తకాల ఆవిష్కరణ




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లో ప్రముఖ హెపటాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్. సోమశేఖర్ రావు రచించిన 'లాస్ట్ వార్నింగ్' (ఆంగ్లం), 'ఆఖరి హెచ్చరిక' (తెలుగు) పుస్తకాలను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ శభరి బైరెడ్డి, యశోద హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జి.ఎస్. రావు కలిసి పుస్తకాలను విడుదల చేశారు.కాలేయ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం ఈ పుస్తకాల ప్రధాన ఉద్దేశమని డాక్టర్ సోమశేఖర్ రావు తెలిపారు. సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో రూపొందించిన ఈ పుస్తకాల్లో ఫ్యాటీ లివర్, హెపటైటిస్, లివర్ సిర్రోసిస్ వంటి వ్యాధులు, వాటి లక్షణాలు, ప్రమాద కారకాలు, నివారణ మార్గాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై సమగ్ర సమాచారం పొందుపరిచారు.ఈ సందర్భంగా కాలేయ వ్యాధులతో పోరాడిన పలువురు 'లివర్ హెల్త్ అంబాసిడర్లకు' తొలి ప్రతులను అందజేయగా, ఈ పుస్తకాలను ప్రతి కాలేయ రోగికి, వారి కుటుంబాలకు అంకితం చేస్తున్నట్లు రచయిత ప్రకటించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఒకేసారి పుస్తకాలను విడుదల చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజల్లో కాలేయ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

**రచయిత గురించి...**

డాక్టర్. కె.ఎస్. సోమశేఖర్ రావు హైదరాబాద్‌కు చెందిన సీనియర్ హెపటాలజిస్ట్ మరియు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్. కాలేయ వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విశేష అనుభవం కలిగిన ఆయన వైద్య సేవలతో పాటు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన స్థాపించిన "సేవ్ ది లివర్ ఫౌండేషన్" ద్వారా కాలేయ వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, ఉచిత ఆరోగ్య శిబిరాలు, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న చాగంటి

**ముద్ర, కోరుట్ల;** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కోరుట్ల పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయాన్ని ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చాగంటి కోటేశ్వరరావు ను అర్చకులు బీర్నంది నరసింహాచారి స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని సందర్భంగా ఆలయంలో స్వామివారి మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా జడ్జి సునీత రవీందర్ రెడ్డి, కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జ్ పావని స్వామివారిలను దర్శించుకోగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వారికి శాలువాతో సన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు యతిరాజం నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ పెడివెల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరికి కీలక బాధ్యత..

**- ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లుపై కీలక కమిటీల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం..**
**- సామాజిక న్యాయం – సమాన అవకాశాల దిశగా సీఎం రేవంత్ రెడ్డి మరో ముందడుగు..**
**- అణగారిన వర్గాల స్వరం ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిధ్వనించేలా కీలక బాధ్యతలు..**



**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1077ను ప్రభుత్వం జారీ చేసింది. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది.అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు–2026" కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి సభ్యత్వం కల్పించింది.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయం సాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

## సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**ముద్ర, హైదరాబాద్ :** నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.



## ఆంధ్రా కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

**కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు**
**గుంతకల్లు–బళ్లారి 3, 4వ రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్**
**రూ.1,264 కోట్ల రైల్వే ప్రాజెక్టుతో రాయలసీమకు భారీ ఊతం..**
**తూర్పు–పడమర రైల్వే కారిడార్ బలోపేతం**
**కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు మెరుగైన రైలు అనుసంధానం**



**ముద్ర, అమరావతి :** గుంతకల్లు – బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీ, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టుతో తూర్పు, పడమర రైల్వే కారిడార్ మరింత బలోపేతం అవుతుందని, రాయలసీమ, ఉత్తర కర్ణాటక, గోవా మధ్య రవాణా అనుసంధానం మెరుగుపడుతుందని సీఎం తెలిపారు. ప్రయాణికులు, సరకు రవాణా వేగవంతం కావడంతో పాటు ప్రస్తుతం ఉన్న రైల్వే మార్గాలపై రద్దీ కూడా తగ్గుతుందని వెల్లడించారు. రూ.1,264 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో దాదాపు రూ.600 కోట్లు ఆంధ్రప్రదేశ్ లోనే ఖర్చు కానున్నాయని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు అనుసంధానం మెరుగై.. కొత్త ఆర్థిక అవకాశాలు ఏర్పడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్ వేగవంతమైన ప్రగతికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

## జన్ జీ పోరాటం ఆగొద్దు.. కేసులు ఎత్తివేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :** నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో విద్యార్థుల ఉద్యమం సాధించిన విజయం చారిత్రాత్మకమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. అయితే ఇదితో పోరాటం ముగియలేదని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.జన్ జీ యువత దేశ భవిష్యత్తు అని పేర్కొన్న సీఎం, యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని ప్రకటించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ నాయకత్వం పోరాడుతుందని తెలిపారు.

జర్మనీ, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లో యువతకు రాజకీయ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేసిన రేవంత్, భారతదేశంలోనూ యువతకు అదే అవకాశం కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. జన్ జీ స్వరం పార్లమెంట్‌లో బలంగా వినిపించేలా కాంగ్రెస్ కృషి చేస్తుందని, ఈ ఉద్యమం ఇక్కడితో ఆగకుండా దేశవ్యాప్తంగా కొనసాగాలని పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 26.07.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com





150 Years of Vande Mataram

Digital India

VANDE MATARAM FRAMES

CERTIFICATE OF PARTICIPATION

This is to acknowledge that

Kalyanam Srinivas (Team Lead)

participated in the Vande Mataram Frames - Film Making Competition under the 'AI Based Film' category as a Team Lead of 'RAji RAj Media House'.

We appreciate the creative contribution in celebrating "150 years of the National Song Vande Mataram"

Date: 16/05/2026

Shri Samar Nanda
Joint Secretary, Ministry of Culture

# సాహిత్యం నుంచి ప్రపంచ రికార్డు

## AI సినీ ప్రపంచం వరకు ప్రస్థానం..

### గౌరవ డాక్టరేట్‌తో మరో మైలురాయి సాధించిన శ్రీనివాస్

సాహిత్యం, చిత్రకళ, జర్నలిజం, కార్టూనింగ్, అనిమేషన్, కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత సంగీతం, షార్ట్ ఫిల్మ్స్, వెబ్ సిరీస్‌లు, ఫీచర్ ఫిల్మ్ నిర్మాణం... ఇలా ఒకే వ్యక్తిలో అనేక ప్రతిభలు మిళితమైన అరుదైన సృజనకారుడు కల్యాణం శ్రీనివాస్. తెలుగు సాహిత్యం, కళలు, అనిమేషన్ మరియు AI ఆధారిత సృజనాత్మక రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ Global Achievers Council మరియు South Western American University సంయుక్తంగా ఆయనకు తెలుగు సాహిత్యంలో గౌరవ డాక్టరేట్ (Honorary Doctorate in Telugu Literature) ప్రదానం చేశాయి.

**సాహిత్యంతో ప్రారంభమైన ప్రయాణం**

చిన్ననాటి నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న కల్యాణం శ్రీనివాస్ పదో తరగతి నుంచే కవిత్వ రచన ప్రారంభించారు. అనంతరం బి.ఏ. లిటరేచర్ పూర్తి చేసి, ఎం.ఏ. తెలుగు సాహిత్యం (M.A. Telugu Literature)లో స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. విద్యార్థి దశలోనే "హృదయమన గేయ సంపుటి", "పిడికిలి కవితా సంపుటి" అనే రెండు పుస్తకాలను ప్రచురించి రచయితగా గుర్తింపు పొందారు. ఆయన రచించిన అనేక గేయాలు వివిధ వేదికల ద్వారా ప్రజల్లోకి చేరాయి.

**200కు పైగా పుస్తకాలకు చిత్రకారుడు**

రచయిత మాత్రమే కాకుండా ప్రతిభావంతమైన చిత్రకారుడిగా కూడా ఆయన విశేష గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు 200కు పైగా పుస్తకాలకు ముఖచిత్రాలు, అంతర్గత చిత్రాలు రూపొందించి అనేక మంది రచయితల రచనలకు కళాత్మక రూపం ఇచ్చారు.

**ఈనాడు, ఆంధ్రప్రభలో జర్నలిస్టుగా...**

జర్నలిజంపై ఆసక్తితో ఈనాడు మరియు ఆంధ్రప్రభ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. అదే సమయంలో రాజకీయ కార్టూనిస్టుగా కూడా సేవలందిస్తూ సమకాలీన అంశాలపై తనదైన శైలిలో కార్టూన్లు రూపొందించి ప్రశంసలు అందుకున్నారు.

**సంప్రదాయ 2D అనిమేషన్‌లో..**

1996లో లక్ష్మీపతి స్కాలర్‌షిప్ లభించడంతో హైదరాబాద్‌లో అనిమేషన్ కోర్సు పూర్తి చేసిన ఆయన, అనంతరం దాదాపు 20 సంవత్సరాలకు పైగా Traditional 2D Animation Directorగా అనిమేషన్ పరిశ్రమలో పనిచేశారు. సినిమా భాష, విజువల్ స్టోరీటెల్లింగ్, షాట్ కంపోజిషన్, స్క్రీన్‌ప్లే, కెమెరా వ్యాకరణం, ఎడిటింగ్ తదితర అంశాలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.
ఒక్కరే 22 రోజుల్లో పూర్తి చేసి ప్రపంచ రికార్డు
అనిమేషన్ రంగంలో పనిచేస్తున్న సమయంలో "Lady Luck" అనే ప్రముఖ అనిమేషన్ సిరీస్‌లో సాధారణంగా 20 మంది సీనియర్ అనిమేటర్లు కలిసి రూపొందించాల్సిన ఒక పూర్తి ఎపిసోడ్‌ను, కల్యాణం శ్రీనివాస్ ఒక్కరే (Single Hand) కేవలం 22 రోజుల్లో పూర్తి చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు.
ఈ అసాధారణ ప్రతిభను గుర్తించిన కెనడాకు చెందిన Amberwood Entertainment సంస్థ ఆయనకు ప్రత్యేక ప్రశంసా పత్రం (Certificate of Appreciation) ప్రదానం చేసింది. ఈ ఘనత ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అనిమేషన్, చిత్రకళ, కార్టూనింగ్ రంగాల్లో ఆయనకు అనేక అవార్డులు, ప్రశంసలు, సన్మానాలు లభించాయి.

**AI ఫిల్మ్ మేకింగ్‌లో కొత్త దిశ**

సంప్రదాయ సినీ నిర్మాణంపై ఉన్న అనుభవాన్ని ఆధునిక సాంకేతికతతో మేళవిస్తూ, గత ఏడాది నుంచి AI ఆధారిత ఫిల్మ్ మేకింగ్ పై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న వివిధ AI టూల్స్‌ను అధ్యయనం చేస్తూ, వాటి సామర్థ్యాలు, పరిమితులు, పూర్తి స్థాయి సినిమా నిర్మాణంలో వాటి వినియోగంపై నిరంతరం ప్రయోగాలు చేస్తున్నారు. AI ద్వారా సినిమా నిర్మాణానికి సంబంధించిన తన అనుభవాన్ని యూట్యూబ్, శిక్షణ కార్యక్రమాలు, ఇతర వేదికల ద్వారా వేలాది మందితో పంచుకుంటున్నారు.

**"పారిజాత"తో వినూత్న ప్రయోగాలు**

AI సాంకేతికతను వినూత్నంగా వినియోగిస్తూ "పారిజాత" అనే AI ఇన్‌ఫ్లూయెన్సర్‌ను సృష్టించి, ఆమెను కథానాయికగా ఉపయోగిస్తూ AI సంగీత వీడియోలలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 50కి పైగా తెలుగు పాటలకు స్వయంగా సాహిత్యం రచించి, AI ద్వారా సంగీతాన్ని రూపొందించి, అదే AI సాంకేతికతతో ఫోటోరియలిస్టిక్ విజువల్స్‌ను సృష్టించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన రూపొందించిన పాటల్లో:



"శ్రీ రాముడు మాదేవుడు"
"ఏములాడ గుళ్లల్లా"
"ఎండయ్యో శివయ్య"
"అమ్మ పాట"
"పార్వతే సతి జంగమా"
"దూదు బసవన్నలు"
"బతుకమ్మ పాట"
"సంక్రాంతి పాట"
"కొడుకుల్లారా"
"ఎవరికీ అర్థం కాదు"
"ఇంత సొగసు ఎక్కడిది"
"యాదికొస్తావే"
"మందు బాబులు"
"సాఫ్ట్‌వేర్ సత్తి"
వంటి అనేక గీతాలు విశేష ప్రజాదరణ పొందాయి.

**AI Video Making అవగాహన**

AI సాంకేతికతను ప్రతి తెలుగు వ్యక్తికి చేరవేయాలనే లక్ష్యంతో "AI Video Making Telugu" పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. ఈ ఛానల్ ద్వారా AI సంగీతం, AI వీడియోలు, AI షార్ట్ ఫిల్మ్స్, AI సినిమా నిర్మాణం, ఆధునిక AI టూల్స్ వినియోగంపై వేలాది మందికి సులభమైన తెలుగులో అవగాహన కల్పిస్తున్నారు.

**AI Film Making Academy**

AI రంగంలో శిక్షణను మరింత విస్తరించేందుకు "Kalyanam Srinivas AI Film Making Academy"ను స్థాపించారు.
AI Music
AI Film Making
AI Storytelling
Prompt Engineering
AI Visual Design
AI Short Films
AI Feature Film Production
వంటి విభాగాల్లో సమగ్ర శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్తులో తెలుగు యువతను ప్రపంచ స్థాయి AI సినీ సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అకాడమీని అభివృద్ధి చేస్తున్నారు




**AI షార్ట్ ఫిల్మ్స్‌తో ప్రశంసలు**

ఇటీవల "వందే మాతరం" పేరుతో నిర్వహించిన AI షార్ట్ ఫిల్మ్ పోటీలో ఐదు నిమిషాల నిడివి గల AI షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించి విశేష ప్రశంసలు అందుకున్నారు. ఈ కృతికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచి అభినందన పత్రాన్ని అందుకున్నారు. అలాగే POCSO చట్టంపై అవగాహన కల్పించే ఐదు నిమిషాల AI షార్ట్ ఫిల్మ్‌ను, సామాజిక సమస్యలను ప్రతిబింబించే "శ్మశానం" అనే మరో AI షార్ట్ ఫిల్మ్‌ను కూడా నిర్మించారు.

**ప్రస్తుతం "మాయపుటలు" వెబ్ సిరీస్.. పూర్తి స్థాయి AI సినిమా**

ప్రస్తుతం "మాయపుటలు" పేరుతో AI వెబ్ సిరీస్ నిర్మాణంలో నిమగ్నమై ఉన్న కల్యాణం శ్రీనివాస్, పూర్తిస్థాయి AI ఫీచర్ ఫిల్మ్ నిర్మాణానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, విజువల్ డిజైన్, పాత్రలు, విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ వరకు AI సాంకేతికతను సమగ్రంగా వినియోగిస్తూ తెలుగు సినీ పరిశ్రమలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు.

**గౌరవ డాక్టరేట్‌కు అర్థవంతమైన గుర్తింపు**

సాహిత్యం, కళలు, జర్నలిజం, చిత్రకళ, అనిమేషన్, AI సంగీతం, AI సినిమా నిర్మాణం, సాంకేతిక విద్య ప్రచారం, యువతకు శిక్షణ.. ఇలా అనేక రంగాల్లో కల్యాణం శ్రీనివాస్ అందించిన సేవలకు గుర్తింపుగానే ఈ గౌరవ డాక్టరేట్ లభించిందని సాహిత్య, కళా, సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సంప్రదాయ కళలను ఆధునిక కృత్రిమ మేధస్సుతో మేళవిస్తూ, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా వినిపించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్న కల్యాణం శ్రీనివాస్ ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

**తెలుగు సాహిత్యానికి AI సంగీతం**

AI సంగీతాన్ని కేవలం తన సృజనలకు మాత్రమే పరిమితం చేయకుండా అమెరికా, సింగపూర్, దుబాయ్, జాంబియా దేశాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది సాహితీవేత్తల పాటలకు పూర్తిగా ఉచితంగా AI సంగీతాన్ని అందిస్తూ వారి రచనలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ప్రచురణలు, సంగీత రూపం కోసం ఎదురుచూస్తున్న అనేక మంది సాహితీవేత్తల రచనలు ప్రజల్లో కి చేరడమే కాకుండా, స్తబ్దంగా ఉన్న వారి సాహిత్య సృజనకు కొత్త ఊపు నిచ్చారు. AI సంగీతం ద్వారా కొత్త తరం రచయితలు, కవులు, గేయరచయితలను ప్రోత్సహిస్తూ సాహిత్య సేవలో విశేష పాత్ర పోషిస్తున్నారు.

# కార్గిల్ అమరవీరులకు వందనం

మంచు శిఖరాలపై మృత్యువుతో
మల్లయుద్ధం చేసిన వీరులారా
మాతృభూమి మాన్యాన్ని
కాపాడిన మహనీయులారా.

తూటాల వర్షాన్ని పూలవానగా
స్వీకరించిన ధీరులారా,
త్రివర్ణ పతాకం కోసం ప్రాణాలను
తృణప్రాయంగా అర్పించిన శూరులారా.

గడ్డకట్టే చలిలో గుండెల్లో
దేశభక్తి జ్వాలలు రగిలించారు,
శత్రువుల గుండెల్లో సింహగర్జనై
విజయపతాకం ఎగురవేశారు.

ఒక్క అంగుళం నేలను కూడా
విడిచిపెట్టని సంకల్పమే మీది,
భారతమాత నుదుట
విజయ తిలకం దిద్దిన గౌరవం మీది.

మీ రక్తపు ప్రతి బిందువూ
స్వేచ్ఛకు సంతకమై నిలిచింది,
మీ త్యాగగాథ ప్రతి భారతీయుని
హృదయంలో శాశ్వతమై నిలిచింది.

కార్గిల్ కొండలు నేడు
మీ పరాక్రమాన్ని ప్రతిధ్వనిస్తున్నాయి ,
అమరవీరుల గాథలు తరతరాలకు
స్ఫూర్తి గీతాలై వినిపిస్తున్నాయి.



వీరజవాన్ల అడుగుజాడల్లో
దేశభక్తి పుష్పాలు విరియాలి,
వారి త్యాగస్ఫూర్తితో ప్రతి
యువహృదయం వెలగాలి.

అమరవీరులారా...
మీకు మా శతకోటి
వందనాలు,
జై జవాన్.. జై హింద్.. జై
భారత్!

సాధన తేరాల, ఖమ్మం

# లోపాలు సరిదిద్దితేనే విజయం

దేశ రాజకీయ, విద్యా వ్యవస్థలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్లు, రాజకీయాల్లో "కాక్రోచ్ జనతా పార్టీ" అనే వ్యాఖ్య చుట్టూ జరిగిన వాదోపవాదాలు, లడఖ్ పర్యావరణ ఉద్యమకారుడు సోనామ్ వాంగ్‌చుక్ దీక్ష విరమణ, అలాగే ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చిన పటిష్టమైన చట్టం.. ఈ సంఘటనలన్నీ వేర్వేరుగా కనిపించినా, వాటి అంతరార్థం మాత్రం ఒకటే. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం.

**నీట్ లీక్ – విద్యార్థుల నమ్మకానికి గండి**

దేశంలో లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్షపై అపారమైన ఆశలు పెట్టుకుంటారు. అలాంటి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీక్ కావడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు. కష్టపడి చదివిన విద్యార్థుల నమ్మకాన్ని దెబ్బతీసిన ఘటన కూడా. పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తితే, ప్రతిభ ఆధారంగా అవకాశాలు పొందాలనే వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుంది. ఇలాంటి ఘటనల తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, భవిష్యత్తులో పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయడం ముఖ్యమైన అంశం.

**రాజీనామా డిమాండ్ – రాజకీయ బాధ్యతకు అద్దం**

నీట్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షం డిమాండ్ చేసింది. ప్రభుత్వం మాత్రం వ్యవస్థలో లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టామని, కేవలం రాజకీయ ఒత్తిడి వల్ల రాజీనామా అవసరం లేదని స్పష్టం చేసింది. కానీ నైతిక బాధ్యతతో రాజీనామా చేయాల్సిన అవసరం ఉంది.



శ్రీనివాస్, జర్నలిస్ట్

ప్రజాస్వామ్యంలో రాజీనామా అనేది శిక్ష కాదు, నైతిక బాధ్యతకు చిహ్నం. అయితే ప్రతి పరిపాలనా వైఫల్యానికీ రాజీనామానే పరిష్కారమా? లేక లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే అసలు బాధ్యతా? అనే చర్చ కూడా సమానంగా అవసరం.

**సోనామ్ వాంగ్‌చుక్ ఉద్యమం**

లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల హక్కుల కోసం సోనామ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్ష దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వంతో చర్చలకు అవకాశం కల్పిస్తూ ఆయన దీక్షను విరమించడం సానుకూల పరిణామమే. అభివృద్ధి అవసరమే. కానీ ప్రకృతి సంపదలను కాపాడుతూ, స్థానిక ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ ముందుకు సాగితేనే దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమవుతుంది. ఉద్యమాల పరిష్కారం ఘర్షణలో కాదు; సంభాషణలోనే ఉంటుంది. అయితే ఇక్కడ మరో వాదన వినిపిస్తోంది. వాంగ్ చుక్, కాక్రోచ్ పార్టీ, ఉద్యమకారులందరూ దేశ విద్రోహులు, అర్బన్ నక్సలైట్లు అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా జంతర్ మంతర్ వద్ద ఆందోళనకారులు మాత్రం ప్రభుత్వానికి గట్టి సవాలు విసురుతోంది. మేమంతా ఉగ్రవాదులైతే.. మీ దగ్గర పటిష్టమైన పోలీస్, నిఘా వ్యవస్థ ఉంది కదా. వాటిని ఉపయోగించి తేటతెల్లం చేయాలని అడుగుతున్నారు. దీని ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందో చూడాలి.

**పటిష్టమైన చట్టం – అమలే అసలు పరీక్ష**

ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన శిక్షలతో కొత్త చట్టాన్ని అమలు చేసింది. లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, ముఠాలు, సంస్థలపై కఠిన చర్యలకు ఈ చట్టం అవకాశం కల్పిస్తోంది. అయితే చట్టం ఎంత కఠినంగా ఉన్నా, అమలు సమర్థంగా లేకపోతే ప్రయోజనం ఉండదు. ఆధునిక సాంకేతికత వినియోగం, పరీక్షా నిర్వహణలో పారదర్శకత, డిజిటల్ భద్రత, వేగవంతమైన దర్యాప్తు, నిందితులకు తక్షణ శిక్ష ఇవన్నీ కలిసొస్తేనే విద్యార్థుల్లో విశ్వాసం పునరుద్ధరించగలుగుతాం.

**విశ్వాసమే వ్యవస్థల మూలధనం**

ఈ సంఘటనలన్నీ ఒకే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో చట్టాలు, పదవులు, రాజకీయాలు, ఉద్యమాలన్నింటికీ అంతిమ లక్ష్యం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం. పరీక్షలపై విద్యార్థుల నమ్మకం, ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం, రాజకీయాలపై గౌరవం, ప్రజాస్వామ్య సంభాషణపై నమ్మకం ఇవి కోల్పోతే ఏ వ్యవస్థా బలంగా నిలవదు.

అందుకే జవాబుదారీతనం, పారదర్శకత, సంయమనం, చట్టాల కఠిన అమలు అనే నాలుగు సూత్రాలు సమానంగా అమలైతేనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుంది. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే ఏ ప్రభుత్వానికైనా, ఏ రాజకీయ పార్టీకైనా, ఏ వ్యవస్థకైనా నిజమైన విజయంగా నిలుస్తుంది.

**మాటల సంయమనం అవసరం**

ఇటీవలి కాలంలో "కాక్రోచ్ జనతా పార్టీ" అనే వ్యాఖ్య రాజకీయ వేదికపై తీవ్ర దుమారం రేపింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు సహజమే. కానీ వ్యక్తిగత అవమానాలు, తక్కువ చేసి మాట్లాడే పద జాలం ప్రజాస్వామ్య చర్చ స్థాయిని దిగజార్చుతుంది. ప్రజలు నాయకుల నుంచి ఆశించేది పరస్పర దూషణలు కాదు. సమస్యలకు పరిష్కారాలు. రాజకీయ భాష మర్యాదగా ఉంటే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

# చర్చలు సఫలం

## కాక్రోచ్ జనతాపార్టీ మూడు డిమాండ్లకు కేంద్రం అంగీకారం

**ముద్ర, న్యూఢిల్లీ :** నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీ లోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. ''నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది.

- **ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం**
- **నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు కేంద్రం అంగీకారం**
- **ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన**

నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించింది''అని తెలిపారు.

**కేసులు ఎత్తేస్తాం: జేపీ నడ్డా**

నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. ''విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం'' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 26.07.2026
www.mudranews.in | @mudranews



ముసలితనం రాకుండా కొబ్బరి నూనెతో మసాజ్
పడుకునే ముందు కొన్ని చుక్కల వర్జిన్ కొబ్బరి నూనెతో ముఖానికి సున్నితంగా మసాజ్ చేయండి. ఇది చర్మం పొడిబారకుండా కాపాడి యవ్వనంగా కనిపిం చేందుకు తోడ్పడుతుంది.


# అంగరంగ వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు





## భక్తులతో పోటెత్తిన దేవాలయాలు

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా తాండూర్ పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. తొలి ఏకాదశి అత్యంత పుణ్య ప్రదమైన రోజు ఏకాదశి రోజున చేసిన ఉపవాస దీక్ష, ఏదైనా దానాలు చేస్తే అనేక పుణ్య ఫలితాలు సిద్ధిస్తాయని, అదేవిధంగా భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశిని ఆచరించడం ద్వారా శ్రీ మహా విష్ణువు కటాక్షం లభిస్తుందని వేద పండితులు పేర్కొంటారు. శనివారం రోజున తాండూర్ పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయంలో, దస్తగి రిపేట్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, భూకైలాస్ లోని శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర ఆలయం అదేవిధంగా హైదరాబాద్ రోడ్డు మార్గంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసదన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాటు చేశారు. తదనంతరం ఆలయ అభివృద్ధికి చేయూతనం దించిన దాతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కొరకు ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమకు తోచినంత సహాయ సహకారాలు అందించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

**ముద్ర కూకట్‌పల్లి:** కూకట్పల్లి వివేకానంద కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.ఆలయ అర్చకులు రామకృష్ణచార్యులు మాట్లాడుతూ... ఉదయం 3 గంటల నుంచే స్వామివారికి ప్రత్యేక పాలాభిషేకం, విశేష అలంకరణలు చేపట్టినట్లు తెలిపారు.ఆషాఢమాస శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా పరిగణిస్తామని ఆయన వివరించారు. భవిష్య పురాణం ప్రకారం తొలి ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు చతుర్మాస వ్రతాలు కొనసాగు తాయని పేర్కొన్నారు. ఈ పవిత్ర కాలంలో జపం, ధ్యానం, విష్ణు సహస్రనామ పఠనం, దానధర్మాలు, పురాణ పారాయణం చేయడం ద్వారా విశేష పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు తెలియజేశారు.ఈ పూజా కార్యక్ర మాలలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు బీజేవైఎం పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర, మల్కాజిగిరి:** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ, బీజేవైఎం నిరంతరం పోరాటం కొనసాగి స్తాయనీ తెలిపారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే యువ మోర్చా ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పోస్టర్‌ను ఆవిష్కరించి ఉద్యమాన్ని ప్రారంభించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# లక్ష్యాలకు తగ్గట్టుగా ఆదాయం రాబట్టాలి

ఆర్థిక ప్రగతికి అదనపు నిధుల సమీకరణే కీలకం
లీకేజీల అరికట్టడంపై అధికారులు కఠినంగా వ్యవహరించాలి
ప్రభుత్వ భూముల గుర్తింపు, ల్యాండ్ పూలింగ్ పై ప్రత్యేక దృష్టి
అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలి
రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించేలా, బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలకు తగ్గట్లుగా ఆదాయం రాబట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివా లయంలో ఆయన అధ్యక్షతన 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' (రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ) ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై అధికారులతో లోతుగా మంత్రులు సమీక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ..2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించనున్న బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలన్నారు. ముందుగా నిర్దే శించుకున్న క్యాలెండర్ (టైమ్ లైన్) ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయ పెంపు కోసం శ్రమించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టి కోసం అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో మున్సిపల్–పట్టణాభివృద్ధి శాఖ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పరిశ్రమలు, ఎక్సైజ్, మైనింగ్, రెవెన్యూ, రవాణా, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతిపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో ఆయా శాఖలు సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై అధికా రులకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు.రాష్ట్రంలో భూముల మోనిటైజేషన్, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ పరిధిలోని ప్రభుత్వ భూసంపదను సమర్థవంతంగా వినియోగిం చుకునేందుకు అధికారులు సిద్ధం చేసిన సమగ్ర ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. నగర పరిధిలో 'ఉప్పల్ భగాయత్' తరహాలోనే పారదర్శక విధానాలను అవలంబిస్తూ, మరిన్ని ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టేందుకు ఉన్న అవకాశాలను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల వారీగా ఉన్న ప్రభుత్వ భూసంపదను గుర్తించి, ల్యాండ్ పూలింగ్ చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాతృమూర్తికి నివాళి



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి కీ.శే. రుక్కమ్మ మరణించడంతో, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వారి స్వగ్రామానికి చేరుకుని రుక్కమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ని, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ని, మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసా దించాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తో పాటు డిసిసి జిల్లా అధ్యక్షులు ధారా సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, సీనియర్ నాయకులు రవి గౌడ్, అబ్దుల్ రావుఫ్, తాండూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు తదితరులుపాల్గొని రుక్కమ్మ పార్థివ దేహానికి నివాళుల ర్పించారు.

# ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

## బిజెపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాహు శ్రీలత



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ పట్టణ అభివృద్ధిలో ఎంపీ నిధుల ద్వారా వచ్చే నిధులు ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయని 24వ వార్డ్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్, బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాహు శ్రీలత పేర్కొన్నారు. శనివారం రోజున స్థానిక నాయకులు మరియు బిజెపి రాష్ట్ర నాయకులు యు రమేష్ కుమార్, బిజెపి కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ లతో కలసి రూ 5 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల ఎంపీగా గెలిచిన నాటినుండి ఇప్పటివరకు తాండూర్ మున్సిపాలిటీకి రూ.80 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, అమృత్ స్కీం, సి ఆర్ ఐ ఎఫ్, ఉపాధి హామీ పథకం ఇంకా ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో 22 మంది సీఐల బదిలీ

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 22 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ) బదిలీలు జరిగాయి. ఈ మేరకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు.కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న సీఐలను పరిపాలనా అవసరాలు, పోలీసు శాఖలో సమర్థవంతమైన విధుల నిర్వహణ దృష్ట్యా బదిలీ చేసినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ముద్ర ప్రతినిధి, హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ, మయూరి నగర్ కాలనీలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకో వాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు అందించే ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి, సంతకం చేసి తిరిగి వారికి అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించిన తర్వాత బీఎల్ఓ నుంచి అక్‌నాలెడ్జ్‌మెంట్ (రసీదు) తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు.ఎన్యూమ రేషన్ ఫారం తిరిగి సమర్పించిన వారికే ముసాయిదా, తదుపరి తుది ఓటరు జాబితాలో పేరు నమోదవుతుందని స్పష్టం చేశారు. ఫారం నింపి తిరిగి ఇవ్వని వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్నప్పటికీ, హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల్లోకి ప్రవేశానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తక్కువ సమయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజాప్రతి నిధులు సహకరించాలని కోరారు.ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్తులో పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.ము సాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేసినట్లయితే, అవస రమైన గుర్తింపు పత్రాలు సమర్పించి అర్హతను నిరూపించుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు, పాస్‌పోర్టు, విద్యా ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, కుటుంబ నమోదు పత్రం, భూమి లేదా గృహ కేటాయింపు ధ్రువీకరణ పత్రాలు వంటి పత్రాలను అవస రమైతే సమర్పించవచ్చని వివరించారు.ఫారం సమర్పించే ముందు తాజా ఫోటో, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, సంతకం సరి చూసుకోవాలని, సమర్పించిన ఫారం, జత చేసిన పత్రాల ప్రతులను భద్రంగా ఉంచు కోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, నాయకులు చంద్రికా ప్రసాద్ గౌడ్, కిషోర్, వెంకటేష్ గౌడ్, ఉమ, తిమ్మరాజు, సాంబయ్య, శివ, నరేష్, రాజ్యలక్ష్మి , జ్యోతి తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# పచ్చని కూకట్‌పల్లి, హరిత హైదరాబాద్ లక్ష్యంగా మొక్కలు నాటాలి




**ముద్ర కూకట్‌పల్లి:** వనమహోత్సవంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వసంతనగర్ డివిజన్ గోపాలనగర్ కాలనీ పార్కు వద్ద మందలపు రోజారమణి ట్రస్ట్ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండి రమేష్ స్వయంగా మొక్కలు నాటి, కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'వృక్షో రక్షతి రక్షతః' నినాదానికి కట్టుబడి ప్రతి ఒక్కరూ కనీసం నాలుగైదు మొక్కలు నాటాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరితహారం లక్ష్యాలను సాధించడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిర క్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ డైరెక్టర్ రోహిత్, అసిస్టెంట్ డైరెక్టర్ చక్రపాణి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ముసలితనం రాకుండా దోసకాయ రసం

దోసకాయ రసాన్ని ముఖంపై రాసి 10–15 నిమిషాల తర్వాత కడిగేయండి. ఇది చర్మాన్ని చల్లబరచి తాజాగా, తేమతో నిండినట్లు ఉంచుతుంది.



# ఆగస్టు 15 వరకు రోళ్లవాగు ప్రాజెక్టు షెట్టర్ల ఏర్పాటు..

**ఆరు నెలల్లో అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి..**
**నక్కల పేట వద్ద మరో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్..**
**ధర్మపురి నియోజకవర్గ ఇరిగేషన్ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..**



**హైదరాబాద్ / ధర్మపురి:** ఆగస్టు 15వ తేదీ లోపు రోళ్ల వాగు ప్రాజెక్టు షెల్టర్లు ఏర్పాటుచేసి రోళ్ళవాగు ప్రాజెక్టు లో నీటి నిలువ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పై శనివారం హైదరాబాదులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ధర్మపురి నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా ఇరువురు మంత్రులు అధికారుల తో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్ళవాగు ప్రాజెక్టు కు షెల్టర్లు బిగించి ఆగస్టు 15వ తేదీ వరకు 0.25 టీఎంసీల నీటిని నిలువ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

రోళ్ళవాగు ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులకు అంచనాల తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులు ఆరు నెలల లోపు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 జనవరి చివరి కల్లా అక్కపల్లి ఎత్తిపోతల పథకం నుండి రైతులకు నీటిని అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలంలోని జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులు, గొల్లపల్లి మండలంలో యశ్వంత్ రావు పేట, రంగధాముని పల్లి చెరువు ఊడిక తీత పనులకు అంచనాలు తయారు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించిన అడ్లూరి..**

ధర్మపురి మండలంలోని నక్కల పేట గ్రామంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీటిని అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ధర్మపురి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించడంతో ధర్మపురి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి చేస్తాం.. మంత్రి అడ్లూరి..**

ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో ని రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంతో కమిషన్ల కొరకు మాత్రమే ప్రాజెక్టుల పనులు చేశారని తాము మాత్రం రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు.

## విద్యార్థుల పోరాట ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**చరిత్రలో విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిలవలేదు!**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** నీట్ పేపర్ లీకేజ్ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజుల నుండి దేశంలో విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటాల ఉదృతం చేయడం వల్ల నేడు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమాలకు తలొగ్గి రాజీనామా చేశారని ఇది విద్యార్థుల పోరాట ఫలితమేనని, విద్యార్థుల పోరాటాల పట్ల బీజేపీ దాని అనుబంధ సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా నిందలు వేసిన విద్యార్థి పోరాటాలకు తలొగ్గి నీట్ పేపర్ లీకేజీ వాస్తవమేనని ఒప్పుకొని ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసాడని, కేంద్ర మంత్రి బండి సంజయ్ విద్యార్థి ఉద్యమాన్ని నిన్న కించపరిచి నిన్న మాట్లాడారని నేడు ధర్మేంద్ర ప్రధాన్ నేడు ఆయనకు చెంప పెట్టులా రాజీనామా చేసాడని , బండి సంజయ్ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, బిజెపి ప్రభుత్వం లో ఇప్పటికి మూడు సార్లు పేపర్ లీకేజ్ కావడం వల్ల లక్షల మంది విద్యార్థుల ఇబ్బందులు పడ్డారని వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వం లీకేజీలు జరుగుతే నామమాత్రం చర్యలు తీసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే లీకేజీలు, అవకతవకలు అరికట్టవచ్చని , ఈ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లీకేజీ జరిగినప్పుడే చేసి విద్యార్థులకు భరోసా కలిగిస్తే 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే వారు కాదని, ఢిల్లీలో న్యాయం కోసం పోరాడిన విద్యార్థి యువతపై దాడులు, రక్తపాతం జరిగేవి కాదని, దీనికి ముమ్మాటిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు ఇవ్వాలని, విద్య కేంద్రీకరణను వెనక్కి తీసుకోవాలని, భవిష్యత్తులో ఈ ఉద్యమ స్పూర్తిని తీసుకొని అనేక ఉద్యమాలు విద్యార్థులను ఏకం చేసి ఐక్యం చేసి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థుల ఘన విజయం

**ఖుతుబోద్దీన్ పాషా - మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు....**



**ముద్ర, కోరుట్ల;** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశంలోని విద్యావేత్తలు, విద్యార్థి లోకం సాధించిన ఘన విజయమని మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబోద్దీన్ పాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ, వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన పోరాటాల ఫలితంగానే కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా, పారదర్శకమైన రీతిలో పోటీ పరీక్షలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పుష్కరాలకు సరైన ఏర్పాట్లు చేయండి

**వీడియో కాన్ఫరెన్స్ లో ఏడీజీపీ మహేష్ భగవత్ ఆదేశాలు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఏడీజీపీ మహేష్ మురళీధర్ భగవత్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని పుష్కర జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. సమీక్ష సందర్భంగా పుష్కర ఘాట్‌ల వద్ద వాచ్ టవర్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, డ్రోన్ సర్వెలెన్స్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర స్పందన బృందాలు వంటి భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఏడీజీపీ ఆదేశించారు. అలాగే నిర్మల్ జిల్లాలోని బాసర, సోన్, సావర్గాం ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జానకి షర్మిల, భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, కృష్ణ, సత్యనారాయణ, దీపక్, రవీందర్, ఆర్ఐ రామ్‌నిరంజన్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సస్పెండ్ చేసిన దళిత ఎస్సై ఎం. చిరంజీవిని విధుల్లోకి తీసుకోవాలి

**తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు కోరుట్ల అంబేద్కర్ యువజన సంఘాల వినతి....**



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దళిత అధికారి ఎం. చిరంజీవిని ఎలాంటి సమగ్ర విచారణ లేకుండానే సస్పెండ్ చేయడం అన్యాయమని కోరుట్ల నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను ఆశ్రయించారు. శనివారం రోజు కోరుట్ల కు వచ్చిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం కోరుట్ల ఎస్సై ఎం చిరంజీవి సస్పెన్షన్ ను ఎత్తివేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పది రోజుల క్రితం మెట్ పల్లిలో హత్యకు గురైన కర్రే సునీత కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చిందనే ప్రచారం వాస్తవానికి విరుద్ధమని వినతిలో పేర్కొన్నారు. సునితను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా కసుల గంగారెడ్డి అడ్డుకున్నారని తెలిపారు. అయితే, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టకుండా, దళిత అధికారిగా పనిచేస్తున్న ఎం. చిరంజీవిపై చర్యలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. అసలు బాధితురాలిని ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఎలాంటి తప్పు నిరూపితం కాకముందే ఎస్సై చిరంజీవిని సస్పెండ్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎస్సై పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అలాగే బాధితురాలి కర్రే సునిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్లో సునితను ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కసుల గంగారెడ్డిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, వుయ్యాల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జర్నలిస్టు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెట్ పల్లి లక్ష్మణ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు ఉయ్యాల శోభన్, మాల మాదిగ కుల సంఘాల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలి

**కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పడిపెల్లి గంగాధర్**



**ముద్ర ప్రతినిధి , నిర్మల్ :** తెలంగాణలో ఫసల్ బీమా యోజన పథకం అమలు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పడిపెల్లి గంగాధర్, కిసాన్ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు జక్కుల సత్తయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా శాఖ పిలుపుమేరకు శనివారం కలెక్టరేట్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఎలినినో ప్రభావం కారణంగా అన్నదాతలు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు పంట నష్టాలనుండి ఆర్థిక రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రవేశపెట్టిందని వారు పేర్కొన్నారు. దేశంలోని 23 రాష్ట్రాల్లో ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుల ఆదాయ భద్రత, మరియు వ్యవసాయ స్థిరత్వం కోసం, ప్రస్తుత ఎల్ నినో ప్రభావ నేపథ్యంలో ఫసల్ బీమా అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రవీందర్ రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాచకొండ సాగర్, జిల్లా మీడియా కన్వీనర్ బుర్ర రమేష్ గౌడ్, బిజెపి నాయకులు కుమ్మరి వెంకటేష్, సూరజ్, అయిండ్ల సాత్విక్, గణేష్ కులకర్ణి, బత్తుల నారాయణ, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలు, ప్రత్యారోపణలు

**కొనసాగుతున్న కోల్డ్ వార్**





**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ లో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల వర్గాల మధ్య పోటాపోటీగా ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. అభివృద్ధికి కృషి చేస్తుంటే అడ్డు పడుతున్నారని, అధికారులను అవమానిస్తున్నారని శనివారం జరిగిన మున్సిపల్ సమావేశంలో తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ అభివృద్ధి పనుల్లో అధికారులపై ఎమ్మెల్యే వైఖరిని పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. మున్సిపల్ అధికారులను రివ్యూ మీటింగ్ వంకతో బీజేపీ కార్యకర్తల ముందు అవమానించడం సరికాదన్నారు. అధికారులు బలహీన వర్గాలవారు కావటంతో అవమానించారన్న ఆరోపణలు చేశారు. ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడే వంకతో అధికారులను అవమానించే విధంగా వ్యవహరించరాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కౌన్సిల్ సమావేశానికి వచ్చి సలహాలు, సూచనలువి ఇవ్వాలి తప్ప వచ్చిన నిధులను ఆపడం సరికాదన్నారు. దీనికి ప్రతిగా బీజేపీ నేతలు రావుల రామనాథ్ తదితరులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్ఏ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆయనకు రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసే అధికారం ఉంటుందన్నారు. 50 వేల ఓట్లకు పైగా మెజార్టీ తో గెలిచిన ఎంఎల్ఏ, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ గా ఉన్నారని, బొటాబొటి మెజార్టీ తో గెలిచిన మున్సిపల్ నాయకులు ఆయనను విమర్శించటం అర్థరహితం అన్నారు. రివ్యూ సమావేశాలకు హాజరు కావలసిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. కాగా సమావేశాలకు కులాలు ఆపాదించటం సరికాదన్నారు. రూ. 15 కోట్ల అమృత్ నిధులు ఒక వర్గానికి చెందిన కాలనీలకు మళ్ళించి, బీజేపీ కౌన్సిలర్ల ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులను నిర్లక్ష్యం చేస్తున్నారని మండి పడ్డారు. మరోమారు ఇలా చౌకబారు ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఇలా ఆరోపణలు ప్రత్యారోపణలతో అభివృద్ధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఉత్కంఠగా కొనసాగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీలు

**రెండో రోజు అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో హోరాహోరీ పోటీలు**

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్–7 ఖో–ఖో పోటీలు రెండో రోజు కూడా ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావన పెంపొందుతాయని అన్నారు. రెండో రోజు పోటీల ప్రారంభానికి ముందు ఆయన వివిధ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు.



**అండర్-14 విభాగం విజేతలు**

శ్రీ ప్రకాష్ కాన్సెప్ట్ స్కూల్ (ఆంధ్రప్రదేశ్) – గీతా శ్రీ పాఠశాల, జడ్చర్లపై 12–10
విస్టా ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్ – జ్యోతి విద్యానికేతన్, కర్నూలుపై 9–7
సాధు వాసవి ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్ – గీతాంజలి స్కూల్‌పై 12–7
బీవీబీ పబ్లిక్ స్కూల్, బీహెచ్ఈఎల్, హైదరాబాద్ – వాసవి పబ్లిక్ స్కూల్‌పై 10–4
ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం – పల్లవి స్కూల్, కీసరపై 9–4
ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బౌరంపేట్ – వెస్ట్ బెర్రీ స్కూల్, గుంటూరుపై 9–5
శ్రీ విద్యానికేతన్, మహబూబ్‌నగర్ – అల్ఫోర్స్ కరీంనగర్‌పై 16–13
ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ – పేస్ స్కూల్, కాప్రాపై 8–7
ఏకశిలా హై స్కూల్, వర్ధన్నపేట – విస్టా హైదరాబాద్‌పై 17–12

**అండర్-17 విభాగం విజేతలు**

అక్షర వాగ్దేవి పాఠశాల, సికింద్రాబాద్ – సుప్రభాత్ మిడిల్ స్కూల్‌పై 14–13
ఫార్ర్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్, మహబూబ్‌నగర్ – హార్వెస్ట్ స్ప్రింగ్ స్కూల్, ఖమ్మంపై 14–2
కమల్ రాణి స్కూల్, హయత్‌నగర్ – ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బేగంపేటపై 14–5
బ్లూమింగ్ మిడిల్ స్కూల్, ఖమ్మం – సద్గురు స్కూల్, నెల్లూరుపై 17–4
చిత్తూరి పాఠశాల, విజయవాడ – సెయింట్ ఆంద్రూస్, హైదరాబాద్‌పై 14–13
జీఎంఆర్ చిన్మయ స్కూల్, శంషాబాద్ – స్పేస్ సెంట్రల్ స్కూల్, నెల్లూరుపై 9–4
పల్లవి స్కూల్, కీసర – ఒలింపియన్ స్కూల్, మెదక్‌పై 12–3
విద్యా భారతి, హైదరాబాద్ – స్కిల్ స్ట్రోక్ స్కూల్, వరంగల్‌పై 19–1
శ్రీ ప్రకాష్ – వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్, కరీంనగర్‌పై 15–1
వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి – డెక్కన్ స్ప్రింగ్ హై స్కూల్‌పై 13–6
మాంటెస్సోరి ఎలైట్, అనంతపూర్ – శ్రీ విద్యాపీఠ్, నల్గొండపై 28–0
శాంతినికేతన్ స్కూల్, రంగారెడ్డి – ఏకశిలా హై స్కూల్, కరీంనగర్‌పై 17–1
ది శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్, రంగారెడ్డి – ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భావన్‌పేట్‌పై 20–6
విద్యా భారతి, హైదరాబాద్ – శ్లోకీ పాఠశాల, హిమాయత్‌నగర్‌పై 15–4
సంఘమిత్ర పాఠశాల, కూకట్‌పల్లి – అల్ఫోర్స్ పాఠశాల, కరీంనగర్‌పై 13–12

**అండర్–19 విభాగం విజేతలు**

శ్రీ ప్రకాష్ విద్య – సీఆర్ రెడ్డి స్కూల్, ఏలూరుపై 13–8
పల్లవి స్కూల్, హైదరాబాద్ – సిస్టర్ నివేదిత స్కూల్, హైదరాబాద్‌పై 10–9
అక్షర పాఠశాల, నెల్లూరు – హార్వెస్ట్ స్కూల్, ఖమ్మంపై 10–9
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ – వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌పై 13–3

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖో–ఖో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, అంతర్జాతీయ రిఫరీ రవీందర్, ఖో–ఖో అసోసియేషన్ ప్రతినిధులు, అల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీమ్ మేనేజర్లు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 26.07.2026
www.mudranews.in | @mudranews



## ముసలితనం రాకుండా పసుపు – శనగపిండి ప్యాక్

చిటికెడు పసుపు, ఒక చెంచా శనగపిండి, కొద్దిగా పాలు లేదా పెరుగు కలిపి ప్యాక్ తయారు చేసి వారానికి ఒకసారి ఉపయోగించండి. ఇది చర్మం మెరుపును పెంచి మృతకణాలను తొలగించడంలో సహాయపడుతుంది.



# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయినులకు శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు, సంస్థ కార్యదర్శి వి. మాధవీలత కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న 'బాలలకు అందించనున్న న్యాయ సేవల జాతీయ పథకం'ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో ఉపాధ్యాయురాలిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా నియమించారని తెలిపారు. విద్యార్థులకు న్యాయ సేవలు అందించడం, చట్టాలపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి న్యాయ సహాయం అందించడం, న్యాయ సేవా సంస్థలతో సమన్వయం చేసుకోవడం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ల ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 180 మంది ఉపాధ్యాయులు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి శనివారం జిల్లాలోని జూనియర్ సివిల్ జడ్జిలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సంస్థ కార్యదర్శి వి. మాధవీలత బాలల చట్టాలు, పారా లీగల్ వాలంటీర్ల వ్యవస్థ, న్యాయ సేవా సంస్థల విధులు, అందిస్తున్న



సేవలపై వివరించారు. స్పెషల్ జడ్జి మిలింద్ కాంబ్లి పోక్సో చట్టం, బాధితుల రక్షణ, ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్వాతి బాల్య వివాహాల నిషేధ చట్టం, అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరిఫ్ జువెనైల్ జస్టిస్ చట్టంపై వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి బాలల హక్కులు, చట్టపరమైన సమస్యలు, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో సీహెచ్ శ్రీనివాస్ బాధితులకు అందించే నష్టపరిహారం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ బండారు జయశ్రీ కమిటీ విధులు, బాధితులకు అందిస్తున్న సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి లింగారెడ్డి, జిల్లా వ్యాప్తంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేవరకొండలో పోలీసు తనిఖీలు



**ముద్ర, దేవరకొండ:** నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు దేవరకొండ పట్టణంలో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. దేవరకొండ డిఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక డాగ్ స్క్వాడ్ తోకలిసి రంగంలోకి దిగారు. నిషేధిత మత్తు పదార్థాలు గంజాయి, డ్రగ్స్, విక్రయాలు, రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఈ సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధానంగా బస్టాండ్, హోటల్స్, పాన్ షాప్స్, పరిసర ప్రాంతాలు లాడ్జీలలో పోలీసులు క్షుణ్ణంగా అనుమానాస్పద వ్యక్తులను డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల సంస్కృతిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిషేధిత పదార్థాలను విక్రయించినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

### .మాజీ మంత్రి పువ్వాడ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 25 :** ప్రజావ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల పోరాటం, సాధించిన విజయం చెంపపెట్టు వంటిదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ పోరాటం కేవలం ఒక సమస్య పరిష్కారానికి మాత్రమే పరిమితం కాకుండా దేశంలో మార్పును కోరుకునే యువత సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. విద్యార్థులు, యువత ఆశయాలను విస్మరిస్తూ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఉద్యమం తీవ్రమైన హెచ్చరికగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలను ప్రజలు సహించరని వారికి గుణపాఠం చెబుతారనే విషయాన్ని ఈ విజయం మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ఇకపై విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో స్పందించి, ప్రజా సంక్షేమం, విద్యా అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర, బీబీనగర్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమైన ఆహారం, క్రీడా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ మరియు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం కళాశాల కిచెన్ లోని కూరగాయలు, సరుకులు,



వంట సామాగ్రి, గదులను పరిశీలించారు పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు క్రీడా పరికరాలు (స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ ) అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన విద్యా పుస్తకాలు , శిక్షణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "నా పట్టు – నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు. తెలంగాణలో పట్టుపరిశ్రమ అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. పట్టుపరిశ్రమకు నీటి వినియోగం చాలా తక్కువని, రిస్క్ కూడా తక్కువని, రాబడి ఎక్కువగా



ఉంటుందని కలెక్టర్ అన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. సబ్సిడీ పెంపు విషయమై ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ సమర్పిస్తామని, ప్రస్తుతానికి సబ్సిడీ తో పాటు లబ్దిదారులు కొంత భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. కేంద్ర పట్టు బోర్డు, బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా. జి. సుబ్రహ్మణ్యం కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ, కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు పాల్గొన్నారు.

## బొద్దింకల విజయం.. ఒక ముందడుగు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం 25 :** కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రసాద్ రాజీనామా బొద్దింకల పోరాట విజయమని, నేత్తురోడి విద్యార్థి ఉద్యమం రాక్షస ఫాసిస్ట్ దమన నీతి పై సాధించిన విజయంగా సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అభివర్ణించారు. అవినీతి మయమైన విద్యాశాఖ పై, నిరుద్యోగం పై యువత ఆగ్రహ పోరాటం సాధించిన విజయం అన్నారు. మోడీ, అమిత్ షా కార్పొరేట్ , మతోన్మాద ఫాసిస్ట్ రాజ్యం దారుణ కృత్యాలు, బుల్డోజర్ రాజ్యం ప్రజాశక్తి ముందు సాగదని తేల్చి చెప్పిన సందర్భం అని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ అస్తవ్యస్త దోరణి, రాజ్యాంగ విలువల పట్ల నిర్లక్ష్యం పై కూడా చలిచీమల దండు నిలవేసి, రాజ్య వ్యవస్థల తో కుమ్మక్కు ను కడిగేసిన అద్భుత విజయం ఇది అని పేర్కొన్నారు. మొండి, నిరంకుశ , ఫాసిస్ట్ పాలనకు షాక్ ఇచ్చిన ఈ కాక్రోచ్ ల ఉద్యమానికి జేజేలు పలికారు. ఈ పోరాటం దేశ ప్రజాస్వామిక పోరాటానికి ప్రేరణగా నిలవాలన్నారు. జెన్ జెడ్ తరం ఈ స్ఫూర్తి తో దేశ రక్షణకు, రాజ్యాంగ హక్కుల రక్షణకు కదలాలి. ప్రతీ ప్రశ్నించే వారిని, హక్కుల కోసం నిలబడే వారిని దేశద్రోహం చేసే వారిగా నిందలేసిన బీజేపీ ప్రబుద్ధుల మూర్ఖత్వానికి చెంప పెట్టు లాంటి ఈ ఉద్యమం.. మరో స్వతంత్ర పోరాటం గా సాగాలన్నారు.

## పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా ఎస్పీ అక్షాన్ యాదవ్ ఆదేశాల మేరకు డివిజన్ పోలీసు సిబ్బందికి యాదగిరిగుట్టలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్కే, కామినేని హాస్పిటల్, చావా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 141వ శిబిరంలో నిపుణులైన వైద్యులు పోలీసు సిబ్బందికి సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్



నాయుడు, ఆర్‌కే హాస్పిటల్‌కు చెందిన డా. రాజ్‌కుమార్, యాదగిరిగుట్ట సీఐ భాస్కర్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్, ఆలేరు సీఐ యలాద్రి, యాదాద్రి డివిజన్‌కు చెందిన ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### లక్ష పుష్పార్చన



శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సుగంధ పరిమళ పుష్పాలతో పుష్పార్చన చేపట్టారు.

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## గోవింద నామస్మరణతో మార్మోగిన ఆర్థగిర క్షేత్రం



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణంలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీతో గోవింద నామస్మరణం మారుమోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా అన్ని ఏర్పాట్లను చేశారు. సుప్రభాతంతో మొదలైన స్వామివారి దర్శనం రోజంతా స్థానికులు పరిసర ప్రాంత భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు గోత్రనామాలు చదివి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. మునుముందు మరిన్ని సౌకర్యాలను భక్తుల ముందుకు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త కుంభం మనోహర్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు బండారు సుధాకర్(రాము), ప్రధాన కార్యదర్శి మారం భాస్కర్ రెడ్డి, కోశాధికారి పాంపాటి శ్రీధర్ తో పాటు సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## సోలార్ పంప్ సెట్ పరిశీలన

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** బోనకల్ మండలంలోని గార్లపాడులో వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ పనితీరును శనివారం రైతు డిస్కం , రెడ్‌కో వైస్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పరిశీలించారు. నేరుగా రైతుతో మాట్లాడుతూ పనితీరును



తెలుసుకొని సోలార్ పంప్ సెట్ వలన కలిగే లాభాలను వివరించారు. ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ చాలా సంతోషం వ్యక్తం చేశారు. రావినూతల గ్రామంలో ఇంటిపై ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ పనితీరును నేరుగా లబ్ధిదారుని తో మాట్లాడి , ఉచిత విద్యుత్ తో పాటు అదనపు ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వం వలన చాలా సంతోషముగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్కో ఉన్నతాధికారులు ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ (ఐఏఎస్), జిల్లా ఎస్పీ నరసింహ (ఐపీఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటగా, జిల్లా పోలీసు సిబ్బంది ఏకకాలంలో 1,500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు, సమృద్ధిగా వర్షాలు కురవడానికి దోహదపడుతుందని అన్నారు. ఎల్–నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పోలీసు శాఖ చురుకుగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ పోలీసు శాఖ తన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తోందన్నారు. చెట్లు, అడవుల పెంపకం వాతావరణ సమతుల్యతకు ఎంతో అవసరమని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా యువత విజయం

### డిసిసి ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి



**ముద్ర, దేవరకొండ:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించడం యువత విజయమని డిసిసి ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పేపర్ లీక్‌లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని తెలిపారు. ఇటీవల నీట్ వ్యవహారంపై దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. దిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం రాహుల్ గాంధీతో పాటు వివిధ సంఘాలు కూడా ఉద్యమించడం హర్షణీయమని అన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు.

## నిరంకుశ ప్రభుత్వంపై యువత విజయం

### సిపిఐ నేత బాగం హేమంతరావు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నిరంకుశ ప్రభుత్వంపై యువత, విద్యార్థులు పోరాడి విజయం సాధించారని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బిజెపి ప్రభుత్వానికి ఒక గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో హేమంతరావు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడటమే కాకుండా 21 మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు బిజెపి అనుబంధ సంస్థలు అనేక ప్రయత్నాలు చేశాయని మత భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారని హింస ద్వారా విద్యార్థి యువజన ఉద్యమాన్ని అణిచివేయడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో గుండె నిబ్బరంతో శాంతియుతంగా యువజన విద్యార్థులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచారని హేమంతరావు తెలిపారు. ఇది యువత, విద్యార్థులు సాగించిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇప్పటికైనా మోడీ, అమిత్ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ఆయన సూచించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ఆందోళన వద్ద పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారని ఇందులో ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు కూడా పాల్గొన్నాయన్న దానిపై పూర్తి విచారణ జరిపించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. న్యాయ విచారణ జరగాలని అందు కొరకు సిపిఐ డిమాండ్ చేస్తుందని ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు.

## ఉప్పలమ్మ గుడి అభివృద్ధి కమిటీ ఏర్పాటు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని 28 వార్డులో మీనా నగర్ కాలనీలో గల ఉప్పలమ్మ గుడి అభివృద్ధికి, బోనాల పండుగ నిర్వహణకై శనివారం 28 వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత రాజు గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 28 వార్డు పెద్దలు పాల్గొని ఈ సంవత్సరం బోనాల నిర్వహణకు కమిటీ ఎన్నుకున్నారు. వచ్చే నెల ఆగష్టు 2వ తేదీ, ఆదివారం రోజున బోనాలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డిని కలిసి బోనాల పండుగకు మున్సిపల్ తరపున తగు ఏర్పాట్లు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. బోనాల నిర్వహణకు ఏర్పాటుకై 28 వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత రాజు గౌడ్ ని గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకొన్న కమీటిలో కార్యనిర్వాహక అధ్యక్షుడుగా బండారు బాలరాజు, ఉపాధ్యక్షులుగా దొంత లక్ష్మణ్, తాంగేళ్లపల్లి లక్ష్మణాచారి, పెండెం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పాదరాజు సునీల్, కోశాధికారిగా కుసుమ సాయితేజ, కార్యదర్శులుగా 9 మంది కరిపే సురేష్, నానంచర్ల శివ, హిరేకార్ నాగరాజు, రూపేష్ సాహు, హిరేకార్ అమర్, సూదగాని భగత్ చంద్ర, వడిచెర్ల ప్రదీప్, మామిడి పరమేష్, కర్ర సతీష్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కౌన్సిలర్ రత్నపురం బలరాం, బీజేపీ నాయకులు సుర్వి శ్రీనివాస్, రత్నపురం శ్రీశైలం, ఎల్లేటి శివారెడ్డి, వినోద్, సుర్వి మణికంఠ పాల్గొన్నారు.

### ముసలితనం రాకుండా తగినంత నీరు, పండ్లు

రోజుకు 2–3 లీటర్ల నీరు తాగడంతో పాటు విటమిన్ C అధికంగా ఉండే పండ్లు తీసుకోండి. శరీరానికి తేమ అందడంతో పాటు కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది.



# భవన నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరగాలి



**యంగ్ ఇండియా పనులు పరిశీలించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** రామాయంపేట పట్టణంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం పరిశీలించారు. కన్స్ట్రక్షన్ విధి విధానాలు క్షుణ్ణంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రామాయణపేట పట్టణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వేలాది మంది విద్యార్థులు విద్య అభ్యసించే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రూపు దిద్దుకుంటుందన్నారు. నిర్మాణ పనులలో నాణ్యతలో రాజీ లేకుండా ప్రస్తుతం ఉన్న వర్కర్ల కంటే అధికంగా వర్కర్లను ఎంగేజ్ చేసుకుని అత్యంత నాణ్యత ప్రమాణాలతో భవన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, విద్య, సంక్షేమ, మౌలిక, సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రామాయంపేట తహసిల్దార్ రజని, సీఎంఓ రాజు, గణాంక అధికారి నవీన్, మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏఈ షఫి తదితరులున్నారు.

**ఉపాధ్యాయురాలిగా కలెక్టర్**

విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. చేగుంట మండల పరిధిలో గల కేజీబీవీని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. ముందుగా 6,7 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు, 8 వరకు టేబుల్స్ చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను పరిశీలించారు, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. కొన్ని కంప్యూటర్లు మరమ్మతులు గురి కాబడినవని కలెక్టర్ తెలుసుకొని వెంటనే బాగు చేయించి అందరికీ అన్ అకాడమీ అందుబాటులో తీసుకురావాలన్నారు. వంట గదిలోకి వెళ్లి, వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. వెంట జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, డిడబ్ల్యుఓ హేమా భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గణాంక అధికారి నవీన్ ఉన్నారు

# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



**అదనపు కలెక్టర్ నగేశ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్, తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. భూముల సర్వే, రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు శిఖం భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు.

# వందేమాతరం 150 కి 150 మంది దివ్యాంగ విద్యార్థుల నృత్యాభిషేకం

**15 ఏళ్ల అక్షర దేవళ్ల సాహసోపేత ప్రయత్నం**




**"వాళ్లకు జాలి అవసరం లేదు... అవకాశం చాలు." ఈ ఒక్క ఆలోచనతో 15 ఏళ్ల కూచిపూడి నృత్య కళాకారిణి అక్షర దేవళ్ల ప్రారంభించిన ప్రయాణం రవీంద్రభారతి వేదికపైకి వందలాది మంది దివ్యాంగ విద్యార్థులను నడిపించింది. చూపులేని పిల్లలు.. వినలేని పిల్లలు.. మాట్లాడలేని పిల్లలు.. ఆటిజం, మేధో వైకల్యం ఉన్న చిన్నారులు.. వీళ్లందరినీ ఒకే వేదికపై నిలబెట్టి, భారత జాతీయ గేయం వందేమాతరం పూర్తి ఆరు చరణాలకు భారతీయ శాస్త్రీయ నృత్య రూపంలో ప్రదర్శన చేయించడం అసాధ్యమనిపించినా ఆ అసాధ్యాన్ని 15 ఏళ్ల అక్షర దేవళ్ల సుసాధ్యం చేసింది. ఒకరూ ఇద్దరు కాదు 150 మంది బ్లైండ్, డెఫ్, ఆటిజం పిల్లలతో వందేమాతరం నృత్యాన్ని శుక్రవారం రాత్రి రవీంద్ర భారతి వేదికపై ప్రదర్శన ఇప్పించి అందరి ప్రశంసలు అందుకుంది.**

**ముద్ర, హైదరాబాద్:** బేగంపేట లేని దేవనార్ స్కూల్ ఫర్ ద బ్లైండ్ , మలక్ పేట లోని ఫిన్ డెఫ్ స్కూల్, కేవాడిగూడ లోని సుమన్ ఆటిజం సెంటర్, ఆదిలాబాద్ కు చెందిన విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ ఫర్ ఇంటలెక్చువల్ చిల్డ్రన్ పిల్లలు ఈ అరుదైన ప్రదర్శనలో నృత్యం చేశారు. వీరందర్నీ ఇలా ఒక వేదిక పైకి తీసుకువచ్చి, వారితో వందేమాతరం పూర్తి పాటకు నృత్యం చేయించడం వెనుక అక్షర దేవళ్ల చేసిన కృషి ఎంతో ఉంది.దివ్యాంగులకు కావల్సింది జాలి కాదు.. వారికి ఇవ్వాల్సింది అవకాశం అని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పింది. అవకాశాలు కల్పిస్తే ఎలాంటి అద్భుతాలను దివ్యాంగులు సాధించగలరో ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి చూపించింది అక్షర దేవళ్ల.15 ఏళ్ల వయస్సులో దేశవ్యాప్త లక్ష్యంసాధారణంగా టీనేజర్లు తమ చదువు, తమ అభిరుచుల గురించే ఆలోచిస్తారు. కానీ అక్షర దేవళ్ల మాత్రం "వందేమాతరం @150" పేరుతో దేశవ్యాప్తంగా వందేమాతరం పూర్తి అధికారిక గీతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యాన్ని ఎంచుకుంది. కార్గిల్ మంచు కొండల్లో చెప్పులు లేకుండా వందేమాతరం పూర్తి గేయానికి నృత్యం చేయడం నుంచి, బంకిమ్ చంద్ర ఛటర్జీ నివాసాన్ని సందర్శించి యువతకు వందేమాతరం చరిత్రను పరిచయం చేయడం వరకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. అయితే... "ఈ పూర్తి వందేమాతరం పాటను ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఎలా చేరవేయాలి?" అనే ప్రశ్నే ఈ మహత్తర కార్యక్రమానికి పునాది అయింది. కేవలం స్కూల్స్ కు వెళ్లి దివ్యాంగ విద్యార్థులకు వందేమాతరం డ్యాన్స్ నేర్పించడంతో అక్షర ఆగిపోలేదు. వారి ప్రదర్శనకు గుర్తింపు రావాలన్న లక్ష్యంతో, వారికి ఓ పెద్ద వేదికపై ప్రదర్శన చేసే అవకాశం కల్పించడం కోసం రవీంద్ర భారతి వేదికగా "వందేమాతరం 150 – యాన్ ఇన్ క్లూజివ్ డ్యాన్స్ ట్రిబ్యూట్ టు ద నేషన్ బై అక్షర దేవళ్ల" పేరుతో తన సొంత ఖర్చులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.లోపం శరీరానికే.. తెలివికి కాదుఅక్షర ఎంచుకున్న విద్యార్థులు మూడు రకాల వైకల్యాలకు సంబంధించిన వారు. ఒక్కొక్కరిది ఒక్కో సమస్య. అంధ విద్యార్థులను తీసుకుంటే, వారికి చూపు ఉండదు. వారి ముందు డ్యాన్స్ చేసి చూపిస్తే చేయలేరు. ప్రతీ ఒక్కరికీ పాటకు అర్థం చెప్పడం,దానికి తగ్గట్లుగా ముఖ కవళికలు, చేతులు, పాదాలు ఎప్పుడు ఎలా పెట్టాలన్నది కేవలం టచ్ ద్వారా మాత్రమే చెప్పగలం. అక్షర ఓపికగా ప్రతీ ఒక్కరికీ టచ్ ద్వారా వారికి ఈ నృత్యాన్ని నేర్పించింది. కేవలం వందేమాతరమే కాదు, దేవనార్ బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు శ్రీనివాస కల్యాణం ను కూచిపూడి నృత్య శైలిలో నేర్పించి రవీంద్రభారతిలో ప్రదర్శనను ఇప్పించి వారికి జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాన్ని అందించింది.







## పోలీసు కన్నుగప్పి ఖైదీ పరార్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం తీవ్ర కలకలం రేగింది. జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఒక ఖైదీ పోలీసుల కళ్లు గప్పి ఆసుపత్రి ప్రాంగణం నుండి పరారయ్యాడు. స్థానికుల వివరాలు సిద్దిపేట జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఏడుగురు ఖైదీలను సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం శనివారం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం ఖైదీలను తిరిగి పోలీసు వాహనంలోకి ఎక్కిస్తుండగా, సాయి కుమార్ అనే ఖైదీ అత్యవసర ద్వారము (ఎమర్జెన్సీ డోర్) ద్వారా చాకచక్యంగా పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు.పరారైన ఖైదీ సాయి కుమార్ పలు ద్విచక్ర వాహనాల (బైక్) దొంగతనం కేసుల్లో నేరస్థుడిగా శిక్ష అనుభవిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టపగలే ఖైదీ పరారవ్వడంతో సిద్దిపేట త్రీ–టౌన్ పోలీసులు మరియు సాయుధ దళాల సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. జిల్లా సరిహద్దులను, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను అప్రమత్తం చేసి, పరారైన ఖైదీ సాయి కుమార్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## యువత ఏకలవ్యుని ఆదర్శంగా తీసుకోవాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** నేటి యువత ఏకలవ్యుని క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్య సాధనను స్ఫూర్తిగా తీసుకోవాలని రిటైర్డ్ డిపిఓ, ఏకలవ్య సంఘం గౌరవ సలహాదారులు కెమ్మసారం పోచయ్య అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో కలిసి ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుభక్తి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి ఏకలవ్య. ప్రతీక అని అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, సమాజ అభ్యున్నతికి యువత సేవాభావంతో ముందుండాలని, ఎరుకల సామాజిక వర్గం సంక్షేమానికి, హక్కుల సాధనకు రాజకీయాలకతీతంగా ఐక్యంగా కృషి చేయాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శాశ్వత ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేసుకోబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కెమ్మసారం మురళి, లక్ష్మణ్, ఎల్లయ్య, నర్సింలు, సంతోష్ , రాజేష్ ఖన్నా, శ్రీనివాస్, శ్రవణ్, భగవాన్, నాగరాజు, ప్రశాంత్, ముత్తయ్య, యాదగిరి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చారిత్రాత్మక విజయం

**వేలాదిమంది యువతపై జరిగిన క్రూరమైన దాడికి బాధ్యత వహిస్తూ మోడీ బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సోనం వాంగ్ చుక్ 25 రోజుల సుదీర్ఘ నిరాహార దీక్ష తర్వాత, లక్షలాదిమంది యువత, విద్యార్థుల నిరసనల తర్వాత మోడీ నీట్ పేపర్ లీకేజీ పై స్పందించడం అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేసిన సందర్భంగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్, యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఇది గొప్ప చారిత్రక విజయం అని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది అని నినదించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు మాట్లాడుతూ ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నికైన బిజెపి కేంద్ర ప్రభుత్వం దాదాపు 25 రోజుల తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నీట్ పేపర్ లీకేజీ పై నిరసన చేపడుతుంటే, ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం నరేంద్ర మోడీ స్పందించడానికి ఇన్ని రోజులు పట్టిందన్నారు. ఇంతటితో సరిపెట్టుకుంటే ఈ దేశ యువతకు సరిపోదు. కచ్చితంగా రాజకీయాల్లో జవాబుదారితనం రావాలి. అలాగే పదవులు పార్టీ సొత్తు కాదు, ఎవరి వ్యక్తిగత సొత్తు కాదు, ప్రజాసొత్తు. ఎప్పుడైతే ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందో అప్పుడు వారు వెంటనే తమ పదవుల నుండి దిగిపోవాలని అన్నారు. ఈనెల 20వ తేదీన ఢిల్లీలో వేలాదిమంది గాయాల పాలైన యువతకు నరేంద్ర మోడీ బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జరిగినటువంటి నిరసనల్లో యువతపై పెట్టినటువంటి కేసులను వెనక్కి తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని అలాగే నీట్ పేపర్ ని ఆన్లైన్ విధానంలో నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హేమంత్, మణికంఠ,రాజు,వరుణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555